సన్నుతి లేదా?

యం. వి. కృష్ణరావు

౧

"పద్మా! మానాన్నెవరే?"

"ఏమోనమ్మా నాకు తెలియదు."

"కాదు లే, నీకు తెలుసు. నువ్వు వేశ్యకూతురువి"

పద్మమనసు చివుక్కు మన్నది. తక్షణం యింటి కొచ్చి శశిరేఖ నడిగింది.

"అమ్మా! మా నాన్నెవరే?"

"మీ నాన్న చాలగొప్పవాడు. సరియైన సమయాన్ని రానీ, మీ నాన్నెవరో చెబుతాను."

(ఇదిపూర్వగాథ.)

*　　　*　　　*

పద్మాసని యౌవనవసంతములో తొలిఅడుగు వేసిన జవరాలు. చాలసుకుమారమైన హృదయం ఆపిల్లది. మొగలిపూవువంటి మేనిఛాయ, ముఖంమీద ఎఱ్ఱటి పెద్దబొట్టు, భ్రూమధ్యమునుంచి ఫాలముమీది సగము వరకూ కుంకుమపువ్వురేకవలె ఉన్నది. విశాలమైన మెరకకళ్లు, కొంచెంముందుకువంగి ఉద్రేకం సూచించే ముక్కు, గడ్డముమీద చిన్నగుంట, కాలిమీదనుంచి చీలమండలవరకూ నల్లని శిరోజాలు పడుతూంటాయి. చక్కని, గుండ్రని, నునుపైన పిక్కలు. వొంటినిండా నగలే. కళ్లు నవ్వుతుంటాయి. పద్మసంగీతసాహిత్యాలలో అసమాన ప్రజ్ఞనునేర్పును గడించింది. చిన్నప్పటినుంచీ సకల భోగ భాగ్యాలతో తులతూగుతూండేది; ఎప్పుడూ ఆనందవారాశి దోప్పతోగుతూండేది. వీణమీద 'జాగేలరా కృష్ణా!' అని పాడుతుంటే యెట్టిమనసైనా కరిగి నీరాతుంది.

పాఠశాలలో మర్యాదగల కుటుంబాల్లో పుట్టిన పిల్లలతో కలసిమెలసి తిరగడము, తనతోటిపిల్లలకు పెళ్లిళ్లుకావడముకూడా గమనించింది ఆవేదనాహృదయంతో. వేశ్యకులంలో పుట్టినందుకు పద్మయొక్క లేతహృదయం యెంత తరుక్కుపోయిందో!

"అమ్మా! ఈపాఠశాలలో చదువు పూర్తిఅయింది. మరి నాకు పెళ్లెప్పుడుచేస్తావు? నాతోటిపిల్లలలో చాల మందికి పెళ్లిళ్లయినాయి."

"తొందరపడబోకే పద్మా! నీకు తగినవాణ్ణొకణ్ణి కుదురుస్తాను. అయితే అందరికీ జరిగినట్లు నీకుమాత్రం పెళ్లి జరగదు."

పద్మకీ జవాబేమీ అర్థంకాలేదు. అప్పటికి తటస్థంగా ఊరుకుంది.

౨

పద్మకు మొదటినుంచీ తన ఉపాధ్యాయురాలు నళినీబాయి అంటే పరమప్రీతి. ఆమెయింటికెళ్లి వాళ్లమ్మయిచ్చిన జవాబుకి అర్థం అడిగింది. నళినీబాయికి కళ్లనిండా నీళ్లు వచ్చాయి.

"పద్మా! నువ్వునాకు మల్లేనే సంఘ దౌర్జన్యానికి బలియైన ఒకవ్యక్తివి. నేను విధవను. మరి నువ్వో అవినీతికరమైన జీవితానికి అర్పించబడ్డ వేశ్యకన్యవు".

"అయితే నాకెప్పుడూ పెళ్లికాదంటారా?"

"ఊఁహూఁ. మీ అమ్మ చెయ్యనంతకాలం కాదు."

"మా అమ్మ నాకెందుకు చెయ్యదు?"

"నీకు పెళ్లికాకుండావుంటేనే మీ అమ్మకు లాభం. పిన్నలు, పెద్దలు, పెళ్లిఅయినవాళ్లు, కానివాళ్లు-ఒకళ్లేమిటి, అందరూ మీయింటికొస్తారు. నీశరీరాన్ని నాశనంచేస్తారు; మీ అమ్మకు అంతులేని ధనంయిస్తారు,

నువ్వు పెళ్లిచేసుకుంటే మరీ ఐశ్వర్యమంతా యెలా వస్తుంది?"

"అయితే మాఅమ్మకు నాసౌఖ్యంకంటే ధనం యందే యెక్కువ వ్యామోహమా? మా అమ్మ నన్ను గాఢంగా ప్రేమిస్తుం దనుకుంటాను. అట్లాంటిది నా సౌఖ్యాన్ని భంగపరచ నేమీచేయదు".

"పిచ్చిపిల్లా! నువ్వడిగే ప్రశ్నలకు జవాబివ్వడం కష్టం. మీ అమ్మకు పెళ్లిఅంటే పరమ అసహ్యం. పెళ్లిచేసుకోకుండా ఉండే జీవితమే యెక్కువ సుఖకరమైందని ఆవిడదృఢవిశ్వాసం."

"నేను పెళ్లిచేసుకుంటానని మా అమ్మతో ఖండితంగా చెప్పేస్తాను. తప్పకుండా వొప్పుకుంటుందనుకుంటా."

"ఆమె అట్లావొప్పుకుంటుందా? నీమాటల్ని లక్ష్యపెట్టదు."

"ఊc. పెళ్లిచేసుకోకుండా ఆమెగడపిన జీవితం అవినీతికరమైందని, పాపభూయిష్ఠమైందని అమ్మకు నచ్చచెబుతాను. నాకు పెళ్లిచేసుకుని మర్యాదగా బ్రతకాలని వున్నది. అట్లాంటిది నన్నెట్లా బలవంతపరుస్తుంది?"

"వేశ్యాగృహాల్లో ప్రతినిత్యంజరిగే తగాదాలే యివి. ఇష్టంలేని పిల్లల్ని తల్లులు బలవంతంగా యీ నీచవృత్తిలోకి దింపుతున్నారు. ఈవృత్తిచేపట్టిన కొద్దికాలంలోనే పిపాస అనేది యేమన్నావుంటే అది కాస్తా హరించిపోతుంది. ఒక అలవాటు నిర్వర్తించుకోవడంలోకి దిగుతుంది. ఇతరులధనం తానుకోరి తీసుకుంటూవుంటే, ఆకొందరు యితరులు కోరకుండానే దుస్సహమైనవ్యాధులు యిచ్చిపోతారు. వాళ్లలో మును పున్న అంగసౌష్ఠవం వుండదు. సహజంగా కాంతులీనే కళ్లలో కళవుండదు. జీవచ్ఛవాల్లా తయారౌతారు."

"భయంకరం! ఇట్లాంటివి జరుగుతుంటే సంఘం యెట్లా ఊరుకుంటుంది?"

"సంఘంకూడా మీ అమ్మమాదిరే. విజ్ఞానఘనులమని చెప్పుకునేవాళ్లలో కొందరు ఈపడుపువృత్తి చాల ఆరోగ్యకరమైనదని, హిందూసంఘాని కత్యవసరమని గంభీరంగా సెలవిస్తారు. ఈవృత్తినవలంబించే వనితలందరిని పవిత్రమైన (?) దేవాలయాల్లో అర్చకురాళ్లగా భావిస్తారు. ఎందుచేతనంటే దేశంలో అధికంగా మిగిలిపోయిన కామాన్నంతా మింగాలిబ వాళ్లులేకుంటే ఆకామమే కులకాంతలమీదకు విజృంభించేది. విలాసపురుషులు కొంతకాలం వేశ్యలతో తందనాలాడి, తరవాత కులకాంతల్ని చెరచడానికి ప్రయత్నిస్తారు సర్వవిధాలా. ఒక్కవేశ్యజాతిమాత్రం అవినీతికరమైన జీవితాన్ని గడపాలంటానికి సంఘాని కేమీ హక్కులేదు"

"అట్లాగైతే నేను పెళ్లి చేసుకుతీరుతాను మా అమ్మమాటలను ధిక్కరించవలసినా పెళ్లిచేసుకుంటాను. నాప్రాణాలనన్నా అర్పిస్తాగాని ఈకులవృత్తిమాత్రం యెట్లా అనుసరిస్తాను? అనుసరింపజాలను."

"పద్మా! నీది ప్రశంసనీయమైన ఆశయం. అది నువ్వు నెరవేర్చుకోలేవేమోనని నాభయం. ఈ నీమహదాశయంలో సహాయంచేసేవాళ్లు బహుతక్కువ. అదీకాక నిన్ను పెళ్ళిచేసుకుంటానికి ప్రతివాడు ఝంకుస్తాడు. అవినీతికరమైన పనులుచేయడానికి మీదగ్గరకు వస్తారుగాని, యీమర్యాదస్థులంతా మిమ్మల్ని పెళ్లిమాత్రం చేసుకోరు. సంఘసంస్కర్తలు, దేశనాయకులు ఎవరు పడితేవాళ్లు ఎవర్నిపడితేవాళ్లని పెళ్లిచేసుకోమని సలహాచెబుతారుగాని వాళ్లుమాత్రం జలనిధులింకుగాక అంతపని చెయ్యరు. మీ అమ్మను తిరస్కరిస్తే నిన్ను యింట్లోంచి పొమ్మనచ్చు. స్వభావంవల్లగాని, చదువువల్లగాని ధనం ఆర్జించి గౌరవప్రదమైన జీవితాన్ని గడపతగినంతశక్తి నీదగ్గర లేదు. కాబట్టి తొందరపడక. ముందు నిన్ను పెళ్లిచేసుకునే యువకుణ్ణి చూసుకో. ఆ పిమ్మట మీ అమ్మని యెదిరించవచ్చు. నిన్ను దేవుడు ఆశీర్వదించుగాక!"

"ఆపత్కాలంలో మీరు నాకు సహాయం చేస్తారనుకుంటా."

"అందుకు సందేహమేమిటి? నా చేతనైనంత చేయడానికి సిద్ధంగావున్నా".

వివాహంచేసుకుని తనభర్తతో యెన్నో సదాశయాలు పూరించాలనుకున్న పద్మాసని వీటన్నిటికి దూరం కావలసివస్తుందా? అటువంటి నీచమై దుర్భరమైన పాడుజీవితాన్ని ఒక్క క్షణమైనా గడుపగలదా లేతహృదయం? ఈ ప్రక్క రాక్షసిలా తల్లి పెళ్లంటే భగ్గుమని మండిపడుతుంది. ఈ పాపాన్ని యెదుర్కొనే సాహసం, తల్లిని తిరస్కరించే ధైర్యం పద్మాసనిలో ఉన్నదా? ప్రస్తుతపుస్థితిని ఆలోచించుకుంటూ నీళ్లలో పడ్డ ఈగలా కొట్టుకుంటూన్నది పద్మాసని.

3

"నటేశచెట్టి! నీకు వయసులో ఉన్నవాళ్లంటే వ్యామోహంగాని వయసుమీరిన నాలాంటి వాళ్లంటే అంతయిష్టంలేదు."

"నువ్వు ముసలిదానవా శశిరేఖా! ఇంకా ఏభైయేళ్లవరకు నీవొళ్లు ముడతలుపడదు; నేను చెబుతున్నా చూసుకో."

"ఎన్నోవేషాలునేర్చిన దొంగవిసుమా! అందుకనే యింతమందుండగా నిన్నుమాత్రమే పద్మకి కన్నెరికం పెట్టమని అడుగుతున్నా."

"అయితే యెప్పుడాశుభకార్యంకాస్త జరగటం? ఇదుగో చూశావు శశిరేఖా! ఎంతతొందరగా అయితే అంతమంచిది."

"నేటిరాత్రే. బహుమతీగా వెయ్యిరూపాయిలు తీసుకురా. మరి పద్మకేమన్నా ఓ చంద్రహారం".

"అబ్బో! చాలయెక్కువే."

"ఆఁ. నీ కీసొమ్మెంత? అసలు నిన్ను కన్నెరికం పెట్టమని అడగటం నాదేపొరపాటు. సరే, వెంకన్న చెట్టిని కుదురుస్తాలే."

వెంకన్నచెట్టిపేరు వినేసరికి నటేశచెట్టికి ఎక్కడలేని రోషం పుట్టుకొచ్చింది. అయితే దాన్ని బయట పడనీయకుండా,

"కోపపడమాక శశిరేఖా! ఏదో అనుగ్రహించు. నువ్వెంత కావాలంటే అంతిస్తాను".

"చెట్టీ ఒకవిషయం. పద్మ నాకూతురైనా చాల పవిత్రమైనకన్య. యింతవరకు యేపురుషుడిగాలీ సోకి ఎఱుగదు. మ రెట్లా దారికితెచ్చుకుంటావో?"

"అదినాకువొదులు. మన ఆకారం, మనమాట, మనవేషభావలతో, ఊఁహూఁ, యెంతమంది గడుసు పిండాల్ని పట్టిచూశామో. ఒక్కరాత్రి ఆపిల్లతోపాటు నన్ను వొంటరిగా వుండనియ్యి. తరవాతచూడు నా తడాఖా."

"నాకుమట్టుకు నమ్మకం తక్కువే. బొత్తిగా నేచెప్పినమాట వినడంలేదు."

"ఈ ప్రపంచంలో డబ్బుకి, బలానికి, మోసానికి లొంగనిదేం లేదు."

చెట్టి మధురాలోచనతో స్వగృహానికి దారి తీసాడు. రాత్రి ఏడుగంటలకల్లా పద్మ యింటికొచ్చింది. శశిరేఖ కూతుర్ని కావలించుకుని,

"పద్మా! మాటదక్కించుకున్నాను. నీకు లక్ష్మీపుత్రుడైన చక్కని నటేశచెట్టిని కుదిర్చాను."

"మనయింటి కప్పుడప్పుడు వస్తూంటాడు, అతనేనా? అతనికి వేరే పనేమిలేదా, అందరియిళ్లచుట్టూ తిరగడం మినహా?"

"అవునతనే! అతనంటే నీకిష్టమేనా?"

"అయితే అతనికి పెళ్లి అయినట్లుంది. భార్య రూపవతిగూడా! బహుశః పెళ్లాన్ని సరిగా ఏలడం లేదేమో. అట్లాంటివాణ్ణి నేను చేసుకోను. అదీకాక పెళ్లాంవున్నవాడు నన్ను మళ్లీ యెట్లాచేసుకుంటాడు?"

"అమ్మాయి, నిన్ను చెట్టిని పెళ్లిచేసుకోమనడం లేదు. నీ కిష్టంవున్నంతకాలం నీప్రియుడుగావుంటాడు, అంతే!"

"అట్లాగైతే అతన్నెప్పుడూ మనింటికి రావద్దని చెప్పు. అటువంటివాళ్ళతో నాకేమీసంబంధంవద్దు."

"ఏమీ నామాటవినవు? అమ్మాయి, నామాట వినవు?"

"అమ్మా! యేమీ ప్రయోజనం లేదు. ఏమైనాసరే ఈ వేశ్యావృత్తిమాత్రం అవలంబించను. అందరిమాదిరి పెళ్లిచేసుకుని సుఖంగావుంటాను. నేను చావడానికైనా సిద్ధంగా వున్నానుగాని............"

"నీకేం వెఱ్ఱితలలేస్తున్నాయా? పెళ్లిచేసుకున్న వాళ్లుమాత్రం యేం సుఖపడి యేడుస్తున్నారు! వాళ్లకి ధనం లేదు. సుఖం అంతకన్నా లేదు. ఇంట్లో అరవ చాకిరీచెయ్యడం - పిల్లల్ని కనడం; ఎక్కువ కాన్పుల వల్ల దుర్బలత్వమున నీరసించిన దేహంతో, కృశించిన హృదయంతో కాలంగడుపుతారు. నీ ప్రేమకోసం లక్షాధికారులంతా నీకు జోహారు పడతారు."

"ఇక నీలెక్చరు ఆపు. వేశ్యావనితలకుండే దర్జా నాకక్కరలేదు. వేశ్యావనిత సమస్తరోగాల మురికిగుంట. ఎన్నిఅబద్ధాలు! యెన్ని అక్రమాలు!! యెన్ని అప్రమాణాలు!!! ఎంతోమోసంచేసి చీదరవిటుల్ని కామిస్తూన్న దానికంటె నీచమైన బ్రతుకీ ప్రపంచంలో యెక్కడా లేదు."

"అదంతా యిప్పు డెందుకుగాని, యీ రాత్రి నటేశచెట్టి నీప్రియుడుగా ఉంటాడు."

"ఊం హూం."

"ఆం. నిన్నుకని యింతసుఖంగా పెంచినతల్లినే ధిక్కరిస్తావా?"

"ఆ కన్నంతమాత్రాన పిల్లని నైతికంగా చంపడాని కెంతమాత్రం హక్కు లేదు."

"నటేశచెట్టి నాకు వెయ్యిరూపాయలు, నీకో చంద్రహారం చేయించాడు."

"ఆయనవి ఆయనకిచ్చేద్దాం."

"ఇట్లాంటిదానివి నాకడుపు నెట్లా పుట్టావే?"

"ఇంకోకడుపునన్నా పుడితే నా కీబాధ ఉండకుండా పోయేది."

"సరే. నీకోసరం ఖర్చుపెట్టిన ఐదువేలు నాకు అరిగి యిచ్చేసెయ్యి; నాయింట్లోంచి వెళ్లిపో."

"నాదగ్గర యిప్పుడేమీ లేదు. నువ్వునాకోసరం ఖర్చుపెట్టినది వడ్డితోసహా తీరుస్తాను."

"ఈవృత్తి అనుసరించకపోతే అదెట్లా వీలవుతుంది? నువ్వు సంపాదించేవరకు నే నాగను. కాబట్టి నేచెప్పినట్లల్లా చెయ్యి."

"నాకు సాధ్యమైనంతత్వరగా యిస్తాను."

ఆదేసమయానికి చెట్టివచ్చినట్లు కబురువచ్చింది.

"అమ్మా! అతణ్ణిచూడటానికి నాకిష్టంలేదు."

"నువ్వుచూడాలి; నీకోసమే వచ్చాడు - నిన్ను చూస్తాడు."

"సరే, కానియ్యి."

"అతనితో యిట్లా పిచ్చిపిచ్చిగా మాట్లాడావంటే నాయింట్లోంచి ఈక్షణం వెళ్లగొడతాను; జాగ్రత."

౪

నటేశచెట్టి గుమగుమాయింపు సెంటుతో, జల్తారు వస్త్రాలు ధరించి అడుగుల్లో అడుగులు వేసుకుంటూ శోభనపు పెళ్ళికొడుకులాగ బుట్టెడు పూలదండలతో హాజరైనాడు.

"శశిరేఖా! ఏదీ పద్మ?"

పక్కనేఉన్న పద్మనిచూసి నిస్తబ్ధుడైనాడు; చంద్రహారం పద్మమెళ్లో వేశాడు. తక్షణం పద్మ అది తీసేసి,

"ఇది తీసుకెళ్ళి నీపెళ్లానికియ్యి. నిక్షేపంలాంటి పెళ్లాన్నివిడిచి వేశ్యల యిళ్ళకుపోయి, వాళ్ళను పాడుచేసి నువ్వు చెడిపోవడ మెందుకు? నువ్వీ వేశ్యాగృహాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటే నీభార్యమనసు యెంత ఖేదిస్తోందో!"

"పద్మా! యింటికొచ్చిన పెద్దమనిషి నట్లా అవమానం చేస్తావా?"

"నేను అవమానం చేయడం లేదమ్మా. ఆయనకు బుద్ధివచ్చేటట్లు చెయ్యాలని చూస్తున్నా. చెట్టీ! నీకేం సిగ్గులేదు? ఇక్కడనుంచి శాంతంగా వెళ్లిపోగూడదూ?"

"నాయింట్లోంచి పొమ్మనడానికి నీకేం అధికారం ఉన్నదే? ఇది నాయిల్లు; అతను నా అతిథి."



"ఇది తీసుకెళ్లి నీ పెళ్లానికియ్యి"

"అయితే నేనే ఈ పాపభూయిష్ఠమైన కొంపలోంచి లేచిపోతాను."

"ఎక్కడికే?"

"ఎక్కడికో!"

"వయసులోవున్న నీలాంటివాళ్లు రాత్రిసమయంలో బయటకు పోకూడదు."

"ఈ యింట్లోకంటె బయట నాకింకెక్కువ హానికలగదు. ఈ క్షణం నీ యిల్లువిడిచి పోతున్నా."

"నీకర్మం నువ్వనుభవించు."

*   *   *   *

"ఏమిచెట్టీ! నీప్రతాపం అంతా యిట్లా తగలబడ్డదే!"

"నాపని అయిపోయింది. ఇంక నాకొంపకి నే వెడతాను. ఇన్నాళ్లు బ్రతికి యింటివెనక......అన్నంత అయింది నాపని. ఆపిల్ల అన్నమాటలు నాహృదయాన్ని దూసుకుపోయినాయి. ఈచంద్రహారాన్ని, పద్మ అన్నట్లు, నాభార్యకే యిస్తాను. ఎన్నాళ్లో అయింది దానితో మనసారమాట్లాడి సరే, యింక సెలవు."

శశిరేఖస్థితి కాస్త విషమించింది. కళ్లవెంబడి నీళ్లు ఏకధారగా ప్రవహిస్తున్నాయి. తనసంపాదనలో యేమీ మిగుల్చుకోలేదు. ఎత్తినకాలు దించకుండా సర్వసౌఖ్యాలు చూరగొన్నది. ఎంతకాలమని గట్టిగా ఉంటుంది శరీరం? భౌతికంగాచూస్తే వయసు ముదిరింది; వృద్ధాప్యం తొంగిచూస్తోంది. ఇంకెంతకాలమని విటులువస్తారు? తనభావికాలం యావత్తు పద్మమీద - ఆపిల్లసంపాదనమీద ఆధారపడిఉన్నది. తానుచూడబోతే మధురరసాలు త్రాగడానికికూడా అలవాటుపడ్డది. ఏంచేయడానికీ తోచక పక్కమీద పడుకుని వెక్కివెక్కి యేడ్చింది శశిరేఖ.

✂

నెల్లాళ్లయినా పద్మాసని నిజగృహానికి తిరిగిరాలేదు. నళినీబాయియింట్లో వాసంచేస్తూ ఆమెసహాయంవల్ల అయిదుగురు పిల్లలకు సంగీతంనేర్పుతూ నెలకు సునాయాసంగా అరవైరూపాయలు సంపాదిస్తోంది. ప్రతినెల తనతల్లికి ముప్పయిరూపాయలు పంపిస్తూండేది. ఇంతకుముందు తండోపతండాలుగా వస్తూండేవాళ్లు యిప్పుడొక పిట్టకూడా రావడంలేదు శశిరేఖయింటికి. సంపాదన పూర్తిగా తగ్గిపోయింది; జీవితం దుర్భరమైపోయింది.

తలవనితలంపుగా రాణీపేట జమీందారు శశిరేఖయింటికి చక్కా వచ్చాడు. జమీందారుని శశిరేఖ ఉచితరీతి మర్యాదచేసింది. ఎక్కువ కాలయాపన చేయకుండా అసలుగ్రంథంలోకి దిగాడు జమీందారు,

"మీకూతురు అసమాన సౌందర్యవతి అని నాకు మొన్నీమధ్యనే తెలిసింది. మీ అమ్మాయి విషయమై చాల భోగట్టా చేశాను. రాజోద్యానంలో పుష్పించ

వలసిన పుష్పం పద్మాసని. నళినీబాయియింట్లో వున్నంతకాలం మీ పద్మాసనితో మాట్లాడేభాగ్యం నాకు కలగలేదు. కాబట్టి యీ విషయంలో నువ్వు నాకు తగు సహాయంచేస్తావా? అందుకు నిన్ను, మీ అమ్మాయిని సంపూర్ణంగా బహూకరిస్తాను."

"చిత్తం. దేవరవారి అనుగ్రహం మామీద కలగడానికి ధన్యులం. ప్రభువులది దివ్యసుందరస్వరూపం మా అమ్మాయి నాదగ్గరకు మళ్ళీ వస్తుందనే నమ్మకం నాకు లేదు. కాబట్టి మీరేమన్నా సలహాయిస్తే శక్తివంచనలేకుండా ప్రయత్నంచేస్తాను."

"శశరేఖా! నాకొకటి తట్టింది. మీ అమ్మాయి దగ్గరకెళ్ళి 'నువ్వులేందే బ్రతకజాలను. ఈ వృత్తి పూర్తిగా మానేశాను. వచ్చి నాతో ఉండు.' అని బొల్లి బొల్లి యేడ్పులు యేడ్చి పద్మాసన్ని బ్రతిమాలుకో. నీ ప్రార్థనలకు పద్మ తప్పకుండా అంగీకరిస్తుంది. అటు నుంచి నేను నరుక్కొస్తాను."

"అయితే ఈ దాసికి బహుమతీ యెంత?"

"ఓ. ఎంతకావాలంటే అంత! పద్మాసనే మన చేతికి దొరకాలిగాని. సరే నేనింక వెళ్తాను. దీన్ని గురించి తీవ్రమైనప్రయత్నం చెయ్యి."

* * * *

"పద్మా! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకే! నాకళ్లు కాయలుకాచినాయి. నువ్వులేందే యిక బ్రతకలేనే అమ్మాయి. ఈదుఃఖం నాహృదయశోణితాన్ని తాగేస్తోంది. వృత్తి సంపూర్ణంగా వదలిపెట్టేశాను. నాతో కలిసి ఉండమ్మా."

"అమ్మా! నువ్వుమాట్లాడేవి నిజమేనా?"

"సందేహమేమిటి? కడుపు తరుక్కుపోతోంది. ఇందుకు ఆదేవుడే సాక్షి. ఇక నేనెక్కువకాలం బ్రతకను."

"ఇప్పటికి నీత్యాగశీలం నాకు బోధపడ్డది. నీది చాలమృదువైన మనస్సని నాకు మొదటినుంచీ తెలుసు. మనకు మంచిరోజులువచ్చాయి. మనింటికిపోదాం."

పద్మాసని శశిరేఖతోసహా నిజగృహానికి వచ్చేసింది. ఇప్పుడు శశిరేఖయింటికి ఖొక్కడుగూడా రావడంలేదు. ఈపరివర్తనం పరికించేసరికి పద్మ కంతులేని సంతోషం కలిగింది. ఆనాడురాత్రి శశిరేఖ కొవుత్తరం వచ్చింది. అది లేతరంగుకాగితం; చక్కని పరిమళం దానినుండి వెలువడుతూంది.



"మనకు మంచిరోజులువచ్చాయి. మనింటికిపోదాం"

"అమ్మా!

ఎన్నిదినాలైంది నిన్నుచూసి. ఇంతకాలం నిన్ను చూడకుండా వున్నందుకు క్షమించు. నేను దేశాలు తిరగడంలో మీ యోగక్షేమాలు విచారణచేయలేకపోయాను. ఈ అప్రయోజకుణ్ణి యింకా ప్రేమిస్తున్నారనే నానమ్మకం. నాముద్దుచెల్లెలు పద్మ కులాసాగా వుంటోందా? రేపురాత్రి మిమ్మల్ని చూడటానికి మీ యింటికొస్తాను. అమ్మగారికి నానమస్కారాలు. చిన్నచెల్లెలుకి నాముద్దులు.

ఇట్లు,

రాణీపేట జమీందారు."

"మనకష్టాలు గట్టెక్కాయే. మీ అన్నయ్య మన్ని చూడటానికి వస్తున్నాడుట. పాపం మన్ని మఱిచి పోలేదు."

"రాణీపేట జమీందారా?"

"అవునే పద్మా. అతని తండ్రే నీ తండ్రికూడా!"

"అమ్మా! అతనంటే నాకు చాలాయిష్టం. చాల చక్కటివాడు. నేనొకమాటు గానసభ చేసినపుడు నాకో బంగారుపతకంకూడా యిచ్చాడు. అతన్ని చూడాలని నా కెంతో కుతూహలంగావున్నది."

మర్నాడు రాత్రి పదిగంటలకల్లా టంచన్‌గా తలుపుతట్టాడు జమీందారు. పద్మ పరుగెత్తుకుంటూ వెళ్ళి తలుపుతీసింది. జమీందారు పద్మని వొక్కసారి గట్టిగా కావలించుకుని,

"అప్పుడే పెద్దదానవయావు పద్మా! ఎన్నాళ్ళయిందమ్మ నిన్ను చూసి. అమ్మాయి, నీకే చంద్రహారం తెచ్చాను. చూడు." అని పద్మమెళ్లో ఆచంద్రహారాన్ని వేశాడు. పద్మ స్వర్గంలోవున్నట్లుంది. పద్మకి తెలియకుండా, శశిరేఖ జమీందారుచెవిలో యేదోవూది,

"ఈ మంచిరోజున మనమందరం తిరిగి కలుసుకున్నందుకు ద్రాక్షపళ్ళరసాన్ని త్రాగుదాము."

అంతా ద్రాక్షపళ్ల రసాన్ని తాగారు; మెల్లగా శశిరేఖ ఆగదిలోంచి బయటకు వెళ్లిపోయింది.

౬

జమీందారు పద్మని పూర్తిగా నిషాయెక్కేటట్లు ద్రాక్షపళ్లరసం త్రాగనిచ్చాడు. ఆపిల్లయింత కన్నులు, కానుతిరిగిన చక్కని శ్వేతభుజాలు, గాజుల గలగలతో కూడిన పొడుగాటిచేతులు, ఘనమైన వక్షోభాగం, వీటియొక్క ఆకారం చూసి జమీందారు ముగ్ధుడైపోయాడు. పద్మబుగ్గలు పాలుచిలుకుతున్నాయి. భుజాలు యెత్తుగావుండి యెప్పుడు చేతులు వేస్తానా అంటూ జమీందారుచేతులు ముందుకు వెళ్తున్నాయి. ఆకళ్లు విశాల పద్మపత్రాల్లాగు-కాదు, లేడికళ్లలాగు మిలమిల మెరసిపోతున్నాయి. దుస్తులలోంచి తొంగి



"అంతా ద్రాక్షపళ్ల రసాన్ని తాగారు"

చూస్తున్న ఆమె తనుసౌందర్యం ప్రస్ఫుటంగా కనబడుతోంది. పద్మ సౌందర్యపు తలపే అతని నాళాలలోని రక్తాన్ని పరుగులెత్తించింది. జమీందారునోరు ఊట ఊరిపోతున్నది; కళ్లుయింతచేసుకుని చూస్తున్నాడు.

ఆ కోమలివెనకనుండి చేతులుపోనిచ్చి పద్మని ఆలింగనం చేశాడు. తన కఠోరమైన బాహువులతో ఆసుకుమారశరీరాన్ని నలిపేస్తున్నాడు. మైమరచివుండటంవల్ల విస్పష్టంగా 'అబ్బ' అన్నది. జమీందారు మరింత ఉత్సాహంతో ఉబ్బిపోయాడు. అతని కామాట వీణమీటులలా వినబడ్డది.

*   *   *   *

ద్రాక్షపళ్లరసం మైకం తగ్గిపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి తాను జమీందారుచేతుల్లోవున్నది. కళ్లు

నులుముకుంది. అబద్ధంకాదు - భ్రమకాదు. తన్నిపట్టుకున్నది, తన్ని చేతుల్లో గాఢంగా నలిపేసింది, తన్ని ముద్దుపెట్టుకున్నది తన అన్నఅని చెప్పుకున్న ఆజమీందారే. అత నా సుందరిని వదలడములేదు. జమీందారు మళ్ళీ బలవంతముగా ముద్దు పెట్టుకోబోతున్నాడు.

"విడు. నన్నువిడిచిపెట్టు. నీ కేం మతిపోయిందా?"

ఎంతచెడ్డా జమీందారుకింకా పాపభీతిపోలేదు. బిక్కమొహంతో,

"ప్రియురాలా! నిన్ను మోసంచేసినందుకు క్షమించు. నిన్ను పొందాలనుకున్నాను. అందుకు వేరేమార్గం కనబడలేదు. కాబట్టి ఈవిధంగా.........ఎటువంటి శిలాహృదయుణ్ణనా తలక్రిందుచేయగల నీ అప్రతిమాన సౌందర్యం యెదట వూరుకోలేక......"

"చాలుచాలు. ఇక ఆపు నీవాగ్ధాటి. ముందు నన్ను విడిచిపెడ్తావా లేదా?" అని పద్మ గంభీరస్వరంతో అన్నది, "మాఅమ్మ నువ్వు యేకమై చేశారన్నమాట."

ఆయన ఉత్తమనైతిక బలగౌరవాలముందు గడ్డిపోచ అయిపోయినాడు.

"అవును."

"మా అమ్మ కెంతిచ్చావు?"

"మొత్తముమీద పదివేలు."

"వెధవడబ్బుకోసం తల్లి కూతురిసుఖాన్ని, మా నాన్ని అమ్మాలని చూసింది. జమీందారని పేరు పెట్టుకుని, గౌరవమర్యాదలతో బ్రతుకుతున్నానని అందరికి చాటుతూ, అసహాయురాలైన ఒక కన్యని మైకంకమ్మించి చెఱుస్తావు. నీకేంసిగ్గులేదు?"

"పద్మాసనీ! కోపపడవద్దు. నాతప్పు నేను వొప్పుకుంటున్నాను; పశ్చాత్తాప సంతప్తహృదయుడైన ఈజనుడు నీ క్షమార్పణకు తగినవాడుసుమా! నారాజగృహానికి తీసుకెళ్ళి, ఆజన్మాంతము నిన్ను, నీపిల్లల్ని నా భార్యాబిడ్డలులా పోషిస్తాను. అయితే నిన్ను న్యాయసమ్మతంగా వివాహంమటుకు చేసుకోను."

"నోరుమూసుకో. ఇంకా మాట్లాడతావెందుకు? నే నొక అసహాయురాలైన వేశ్యకన్యనైనంతమాత్రాన నాలో పవిత్రత లేదనుకున్నావా? నీ అప్పనుగాని, చెల్లెల్నిగాని ఎవరన్నా యీవిధంగా చేశారనుకో. నువ్వేంచేసేవాడివి చెప్పు"

"ఉన్నవాణ్ణి వున్నపళాన చంపేసేవాణ్ణి. అది ఉత్తమక్షత్రియధర్మం. మరి నువ్వు రాచకన్యవు కావుగా!"

"నన్ను నువ్వు చెఱచనంతవరకు నేను రాచకన్యలంత పవిత్రంగా ఉన్నాను." అని అతని ముఖాన్ని తీక్ష్ణంగా చూసింది.

"అదిమాత్రం వొప్పుకుంటా."



"ఇదిగో నాదగ్గర రివాల్వరుంది. దాంతో....."

"అయితే నీరాజధర్మం నెరవేర్చుకో. నీశౌర్యము, పౌరుషము ఏమైనాయి? ఏంచేసేవాడినో అంత నీమీద నువ్వుచేసుకో. చెయ్యలేవు? పిరికిపందవా?? ఇతరుల విషయంలో నీప్రాణం వెనక్కి లాగుతోందేం? ఏం నీప్రాణమంటే అంతతీపా?"

ఈ ఉద్రేకపూరితమైన మాటలు వినేసరికి జమీందారు పరవశుడై పోయాడు.

"ఇదిగో నాదగ్గర రివాల్వరుంది. దాంతో నన్ను కాల్చెయ్యి"

"సామాన్యకన్యనైన నాకు రాజకుమారుణ్ణి చంపడానికి చేతులు రాకుండా వున్నాయి."

"నేను చావుకుభయపడేఅంత పిరికిపందనుగాను" అని జమీందారు రివాల్వరు పేల్చాడు; కుప్పగా నేలమీద పడిపోయినాడు.

"ఎంత ధైర్యసాహసాలున్న యువకుడు! ఇంకో విధంగా పెంచబడినట్లయితే దేశాని కెంత ఉపకారం చేసేవాడో! పాపం, చేసినపాపానికి పరిహారం చేసుకున్నాడు. పాపపంకిలమైన యీ శరీరంవల్ల యేమీ ప్రయోజనంలేదు." అని అనుకుని తానుకూడా రివాల్వరుతో కాల్చేసుకుంది.

సంఘ దౌర్జన్యానికి, అసహ్యమైన వాడుకలకు యెంతమంది బలి ఐతేనోగాని మనదేశం బాగుపడదేమో. హిందూసంఘం యిప్పుడు జీవంలేని అస్థిపంజరం లాంటిది. ఇట్లాంటివి మతమునే పేరుక్రింద వాడుకలు, అలవాట్లు యెన్నో ఉన్నాయి. అవి పోతేనేగాని దేశానికి మోక్షంలేదు. ఎంతమంది ప్రాణాలు అర్పించందే ప్రజల మనస్సులలో సంచలనం కలుగుతుంది, హృదయ పరివర్తనం వస్తుంది?

అయితే యీలోగా సన్నుతిలేదా వేశ్యాజాతికి?